TGTEL/26/A5513

వార్తదీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 91 | 20 మంగళవారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

పాఠకులకు ప్రకటన కర్తలకు
శ్రేయోభిలాషులకు అధికారులకు
అనధికారులకు ప్రజా ప్రతినిధులకు
మరియు సిబ్బందికి

దసరా శుభాకాంక్షలు.

నేడు కార్యాలయానికి సెలవు
బుధవారం పత్రిక వెలువడదు
పునర్దర్శనం గురువారం



ఇట్లు
పత్రిక
యాజమాన్యం

HAPPY
Dussehra

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత..

ప్రభుత్వానికి హెచ్చరిక..!

- నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలని కవిత డిమాండ్
- లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిక



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు..

కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

- మహేశ్ గౌడ్, పొంగులేటి, వంశీకృష్ణకు బీఆర్ఎస్ నోటీసులు
- నోటీసులు జారీ చేసిన సోమ భరత్ కుమార్
- సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్
- తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని సూచన


కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని ర్ఎస్ ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది. నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.



కరవు, ఎల్ నినో ఎఫెక్ట్...

రంగంలోకి దిగిన టీజీ ప్రభుత్వం, ఆరుగురు మంత్రులతో

- కరవు పరిస్థితులను పర్యవేక్షించి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న కమిటీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కమిటీ చైర్మన్ బాధ్యతలు
- కమిటీలో మొత్తం ఆరుగురు మంత్రులకు చోటు



రాష్ట్రంలో నెలకొన్న కరవు, ఎల్ నినో పరిస్థితులను సమీక్షించి, నివారణ చర్యలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.ఈ సబ్ కమిటీలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరించనుండగా, ప్రణాళికా శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు.రాష్ట్రవ్యాప్తంగా కరవు పరిస్థితులను ఈ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుంది. సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తుంది. నైరుతి రుతుపవనాల సమయంలో రాష్ట్రంలో 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో అనేక మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కరవు నివారణ చర్యలపై దృష్టి సారించి, ఈ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.



ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, ప్రభుత్వ సృష్టించిన కరవు: నిరంజన్ రెడ్డి

- రైతుల కష్టాలకు ప్రభుత్వ అసమర్థతే కారణమన్న నిరంజన్ రెడ్డి
- శ్రీశైలంలో 70 టీఎంసీల నీరున్నా పాలమూరు, కల్వకుర్తి పంపులు నడపడం లేదని ఆరోపణ
- నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్

తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమర్థతే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ...మిగతా 2 లో...



50 డిగ్రీలకు చేరనున్న ఎండలు? గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన

- సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య
- వర్షాలు తగ్గితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం
- గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం
- భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ...మిగతా 2 లో...

గోరఖ్‌నాథ్ ఆలయంలో సీఎం యోగి కన్యా పూజ..

ప్రజలకు కీలక విజ్ఞప్తి

- మహానవమి సందర్భంగా గోరఖ్‌నాథ్ ఆలయంలో కన్యా పూజ చేసిన యోగి
- బాలికల పాదాలను స్వయంగా కడిగి, వస్త్రాలు, కానుకలు సమర్పణ
- విజయదశమి వేడుకల్లో భద్రతను విస్మరించవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- మాతృశక్తికి సనాతన ధర్మంలో ఉన్న గౌరవాన్ని ఈ పూజ ప్రతిబింబిస్తుందన్న యోగి
- చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అన్న సీఎం

2 లో



స్టాక్ మార్కెట్ పతనంపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు..

2027లో ఆ ముప్పు పొంచి ఉందని హెచ్చరిక!

- భారత మార్కెట్ బలహీనతకు సులభమైన నిధుల ఉపసంహరణ కూడా కారణమన్న నిర్మల
- దేశ ఆర్థిక పునాదులు బలంగా ఉన్నాయని స్పష్టీకరణ
- 2027లో విదేశీ పెట్టుబడుల తరలింపు పెద్ద సవాలుగా మారే అవకాశం

పెట్టుబడిదారులు తమ షేర్లను సులభంగా విక్రయించి డబ్బులు వెనక్కి తీసుకుం టుండటం కూడా స్టాక్ మార్కెట్ బలహీ నపడటానికి ఒక కారణమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అయితే దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు బలం గానే ఉన్నాయని స్పష్టం చేశారు. అదే సమ యంలో విదేశీ పెట్టుబడులు భారీగా తరలి పోవడం 2027లో భారత్‌కు పెద్ద సవా లుగా మారవచ్చని హెచ్చరించారు.

...మిగతా 2 లో...

TGTEL/26/A5513
వార్త దీపిక

50 డిగ్రీలకు చేరనున్న ఎండలు? గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు.వర్షాలు తగ్గి భూగర్భజలాలు పడిపోయే పరిస్థితి ఏర్పడితే వ్యవసాయంతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యత తగ్గితే విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతుందని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని తుమ్మల సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. గోదావరి నీటిని నిల్వ చేసే ప్రయత్నాల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో చింతమనేని నవ్య శ్రీ

- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి మద్దతు కోరిన దెందులూరు ఎమ్మెల్యే కుమార్తె

- - రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారిన ఇరువురు నేతల భేటీ

-వార్త బిపీక న్యూస్ :

ఏలూరు జిల్లా రాజకీయాల్లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఇప్పుడిప్పుడే మొదలైంది. ముఖ్యంగా ఏలూరు జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి వివిధ పార్టీల నాయకులు, ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ తరుణంలో ఏలూరు జిల్లా రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది .దెందులూరు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రజల్లో పట్టున్న సీనియర్ నాయకులు చింతమనేని ప్రభాకర్ కుమార్తె చింతమనేని నవ్య శ్రీ రాబోయే జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికలపై పూర్తి దృష్టి పెట్టారు. ఇందులో భాగంగానే ఆమె రాజకీయ మంతనాలు వేగవంతం చేశారు.చింతమనేని నవ్య శ్రీ పోలవరం నియోజ కవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికల్లో తాను చైర్మన్ అభ్యర్థిగా బరిలో నిలవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె ఈ సందర్భంగా బాలరాజుకి తెలిపారు.ఈ ఎన్నికల్లో తనను జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా బలపరచాలని, తన విజయానికి సంపూర్ణ మద్దతును అందించాలని ఆమె ఎమ్మెల్యే చిర్రి బాలరాజుని సాదరంగా కోరారు. జిల్లాలో పార్టీని మరింత బలపడటంతో పాటు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేలా తన కార్యాచరణ ఉంటుందని ఆమె వివరించినట్లు తెలుస్తోంది.నవ్య శ్రీ విజ్ఞప్తిపై పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఎంతో



సానుకూలంగా స్పందించి పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా, జిల్లా అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆయన భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది.ప్రముఖ నాయకురాలిగా ఎదుగుతున్న చింతమనేని నవ్య శ్రీ ఇలా తోటి నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యేలను నేరుగా కలుస్తూ మద్దతు కూడగట్టుకుంటున్న వైనం ప్రస్తుతం ఏలూరు జిల్లా రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశం ద్వారా జిల్లా పరిషత్ పీఠంపై తెలుగుదేశం పార్టీ వర్గాలు మరింత స్పష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు స్పష్టమవుతోంది.

దమ్మపేటలో ఫారెస్ట్ అధికారుల ఆకస్మిక తనిఖీలు: 4 కిలోల గంజాయి, నాటు తుపాకీతో సహా ఆరుగురు నిందితుల అరెస్ట్!

గంజాయి మత్తులో అటవీ జంతువుల వేట: చింతూరు, సీలేరు ప్రాంతాల నుంచి అక్రమ రవాణా గుట్టు రట్టు!

ఇంటి ఆవరణంలో బైక్ ట్యాంక్ కవర్లలో గంజాయి నిల్వలు: పల్సర్ బైక్, 5 సెల్‌ఫోన్లు, వేట సామగ్రి స్వాధీనం!

వార్త బిపీక న్యూస్ :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం కొడిశాలగూడెం గ్రామంలో అటవీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి. అటవీ జంతువుల వేటతో పాటు, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఒక ముఠా గుట్టును అధికారులు రట్టు చేశారు. ఈ దాడుల్లో సుమారు 4 కిలోల గంజాయి, ఒక నాటు తుపాకీతో పాటు భారీగా వేట సామగ్రిని స్వాధీనం చేసుకుని, ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కొడిశాలగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి కృష్ణ ఇంటిలో గంజాయి, నాటు తుపాకీ నిల్వ ఉన్నాయనే పక్కా సమాచారంతో.. దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది జె. భద్రయ్య, ఏ. పార్వతి, పి. రాజరమేష్, ఈ. కాంతారావు, డి. నరేష్ కుమార్‌లు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా నిందితుడి ఇంట్లో రెండు బ్యాగుల్లో బ్రౌన్ కలర్ కవర్లతో చుట్టి ఉంచిన మూడు గంజాయి కట్టలను గుర్తించగా, ఇంటి బయట ఉన్న మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో మరో గంజాయి కట్టను కనుగొన్నారు. ఇలా మొత్తం నాలుగు ప్యాకెట్లలో ఉన్న సుమారు 4 కిలోల గంజాయిని అధికారులు సీజ్ చేశారు. ఈ సోదాల్లో కేవలం గంజాయే కాకుండా, అటవీ జంతువులను వేటాడేందుకు ఉపయోగించే ప్రమాదకరమైన నాటు తుపాకీ లభించింది. దీని పొడవు 35 సెం.మీ., బ్యారెల్ పొడవు 55 సెం.మీ.గా గుర్తించారు. వీటికి తోడు నల్ల పౌడర్, ఇనుప ముక్కలు, కత్తి, టార్చ్‌లైట్, సౌండ్ బాక్స్ వంటి మందుగుండు సామగ్రిని; చిల్లగుంపు గ్రామానికి చెందిన సున్నం మునేంద్రకు చెందిన పల్సర్ మోటార్‌సైకిల్ (నంబర్: ఽ+ 28 దీ 6782)తో పాటు ఐదు సెల్‌ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు నిర్వహించిన విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. కూలీ పనుల ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో వీరు చింతూరు, డొంకరాయి, సీలేరు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, స్థానికంగా అధిక ధరకు విక్రయిస్తున్నట్లు



తేలింది. అంతేకాకుండా, కొంత గంజాయిని తాము కూడా సేవించి.. ఆ మత్తులో అడవిలోకి వెళ్లి అమాయక వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని తింటున్నట్లు నిందితులు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. అదుపులో ఉన్న నిందితుల వివరాలు: 1. పెనుబల్లి నాగు (వయస్సు 23), తండ్రి: కృష్ణయ్య, కొడిశాలగూడెం. 2. పెనుబల్లి రవి (వయస్సు 21), తండ్రి: సూర్యబాబు, కొడిశాలగూడెం. 3. తాటి సాయి కృష్ణ (వయస్సు 23), తండ్రి: రామ్మూర్తి, ఎర్రగుంపు. 4. పెనుబల్లి శ్రీను (వయస్సు 28), తండ్రి: రాజులు, కుడిసెలగూడెం. 5. తాటి నవీన్ (వయస్సు 25), తండ్రి: వీరభద్రం, పాత గంగారం. 6. సప్పిడి సమ్మయ్య (వయస్సు 29), తండ్రి: భాస్కర్, గార్లపేట. ఈ ఘటనపై దమ్మపేట మండల ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా సమాచారం అందించి, ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను పంచులుగా నియమించి నేర అంగీకార, స్వాధీన పంచనామా నిర్వహించిన అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న సామగ్రిని పోలీసులకు అప్పగించినట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

ఎస్పీ రామ్ కుమార్ దంపతులకు ఘన సన్మానం

యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవాలి

నరసింహులగూడెంలో ప్రభుత్వ ఉద్యోగ సాధకులకు సత్కారం

గ్రామ సర్పంచ్ కుంచెం ఇందిరా నరసయ్య

వార్త బిపీక న్యూస్ :

సూర్యాపేట జిల్లా మునగాల మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన ఎస్పీ కామల్ల రామ్ కుమార్, ఆయన భార్య ప్రశాంతి దంపతులను గ్రామ సర్పంచ్ కుంచెం ఇందిరా నరసయ్య ఆధ్వర్యంలో వివేకానంద యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. గత ఆగస్టు 15న రాష్ట్రపతి సేవా పథకం అవార్డు అందుకోవడంతో పాటు ఎస్పీగా పదోన్నతి పొందిన రామ్ కుమార్‌ను గ్రామస్థులు అభినందించారు.ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ.. 1991లో తొలిసారిగా ఎస్సైగా ఉద్యోగం సాధించానని తెలిపారు. గ్రామానికి చెందిన విద్యాసాగర్ రెడ్డి, ఆదిరెడ్డిలను స్ఫూర్తిగా తీసుకుని వారి ఆదర్శాలతో ముందుకు సాగుతూ ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో కష్టపడి చదవాలని, ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కృషి, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు.అనంతరం గ్రామంలో వివిధ



ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతను కూడా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, యువతలో స్ఫూర్తి నింపేలా కార్యక్రమాన్ని నిర్వహించిన వివేకానంద యూత్ సభ్యులను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సీతారాములు, మాజీ సర్పంచ్ కొండారెడ్డి, సీఐ ప్రతాప లింగం, ఎస్సై సంజీవరెడ్డి, న్యాయవాది ఉయ్యాల నరసయ్య, మాజీ ఎంపీటీసీ అయిద్వ, జిల్లా కమిటీ సభ్యురాలు విజయలక్ష్మి, గణేష్‌తో పాటు గ్రామ పెద్దలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్ పతనంపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు..

2027లో ఆ ముప్పు పొంచి ఉందని హెచ్చరిక!

మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాల సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మార్కెట్‌లో నగదు లభ్యత సులభంగా ఉండటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను త్వరగా ఉపసంహరించుకుంటున్నారని ఆమె వివరించారు.ప్రస్తుతం ప్రపంచ పెట్టుబడులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగం వైపు మళ్లుతున్నాయని సీతారామన్ పేర్కొన్నారు. ఏఐతో సంబంధం ఉన్న కంపెనీల్లో పెట్టుబడుల కారణంగా తైవాన్, దక్షిణ కొరియా మార్కెట్లపై పెట్టుబడిదారులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని వివరించారు. అమెరికా, ఏఐ రంగాల వైపు నిధులు తరలిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.అయితే ప్రపంచవ్యాప్తంగా ఏఐ పెట్టుబడుల ఊపు తగ్గి మార్కెట్లు పడిపోయినా భారత్‌పై దాని ప్రభావం తక్కువగా ఉండవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. భారత్‌లో ఆ తరహా పెట్టుబడులు పెద్ద ఎత్తున రాకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. అధునాతన సాంకేతిక రంగంలో భారత్ వెనుకబడలేదని, సెమీకండక్టర్ తయారీపై కూడా పెట్టుబడులు పెడుతోందని చెప్పారు.ఈ ఏడాది ఇప్పటివరకు భారత ఈక్విటీ మార్కెట్ ప్రధాన సూచీలు దాదాపు 12 శాతం పడిపోయాయి. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోంది. అయినా విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ నుంచి భారీగా నిధులను వెనక్కి తీసుకుంటున్నారు.నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారత ఈక్విటీల్లో 33 బిలియన్ డాలర్లకు పైగా విలువైన షేర్లను విక్రయించారు. అక్టోబర్ 16న మాత్రం వరుసగా 15 సెషన్ల పాటు విక్రయాలు జరిపిన తర్వాత ఎఫ్ఐఐలు మళ్లీ నికర కొనుగోలుదారులుగా మారారు. ఆ రోజు సుమారు రూ.1,166 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. మరోవైపు, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐలు) 45 సెషన్ల కొనుగోళ్ల పరంపరను ముగించి, సుమారు రూ.3,661 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

గోరఖ్‌నాథ్ ఆలయంలో సీఎం యోగి కన్యా పూజ..

ప్రజలకు కీలక విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం మహానవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ ఆలయంలో సంప్రదాయబద్ధంగా కన్యా పూజ నిర్వహించారు. శరన్నవరాత్రులలో భాగంగా తొమ్మిదో రోజున నిర్వహించే ఈ విశిష్ట పూజలో ఆయన పాల్గొన్నారు. శక్తి స్వరూపిణులైన బాలికలను ఆరాధించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ స్వయంగా బాలికల పాదాలను ప్రక్షాళన చేసి, వారికి తిలకం దిద్దారు. అనంతరం హారతి ఇచ్చి, పూజలు నిర్వహించి, వారికి వస్త్రాలు, ప్రసాదం, దక్షిణలను సమర్పించి గౌరవించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భండారా (సామూహిక భోజనం) ఏర్పాటు చేశారు.అనంతరం యోగి ఆదిత్యనాథ్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, విజయదశమి వేడుకల సందర్భంగా కీలక సూచనలు చేశారు. పండుగను ప్రతిఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని, అయితే అదే సమయంలో భద్రతా ప్రమాణాలను ఏమాత్రం విస్మరించకూడదని ఆయన కోరారు. చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి, దుర్గుణాల నుంచి విముక్తి పొందాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.శరన్నవరాత్రులలో నవమి తిథికి అత్యంత ప్రాముఖ్యత ఉందని, ఈ రోజున జగజ్జనని తొమ్మిదో స్వరూపమైన సిద్ధిధాత్రి అమ్మవారిని పూజిస్తారని యోగి వివరించారు. సనాతన ధర్మంలో మాతృశక్తికి ఇచ్చే అత్యున్నత గౌరవానికి కన్యా పూజ ఒక నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. మహిషాసురుడిపై దుర్గామాత సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే ఈ నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో ముగుస్తాయి.

విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు..

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాల ప్రకారం.. ఆధవ్ అర్జున రూ.8.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. రంజిత్‌కుమార్ రూ.5 కోట్లు అందించారు. దీంతో పార్టీకి అందిన మొత్తం విరాళాల్లో అర్జున వాటా 60 శాతానికి పైగా ఉంది. టీవీకేకు అత్యధికంగా విరాళం ఇచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారు. ఈ ఇద్దరి విరాళాలతో పాటు మరో రెండు విరాళాలు కూడా పార్టీకి అందాయి. తూత్తుకుడి జిల్లా లయన్స్ టౌన్‌లో ఉన్న స్నో షో సంస్థ రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇచ్చింది. అదే చిరునామాలో నమోదైన స్నో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ కూడా మరో రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందించింది. ఓవరాల్ గా ఈ నాలుగు విరాళాల మొత్తం రూ.13.3 కోట్లుగా ఉంది.ఇదిలా ఉండగా 2025--26 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే సుమారు రూ.161.35 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందుకున్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. ఇందులో టైగర్ అసోసియేట్స్ సంస్థ రూ.135 కోట్లతో అతిపెద్ద విరాళదారుగా నిలిచింది.డీఎంకేకు ఇదే ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.191.19 కోట్ల విరాళాలు అందాయి. ఆ పార్టీకి కూడా టైగర్ అసోసియేట్స్ అత్యధికంగా రూ.125 కోట్లు ఇచ్చింది. కోల్‌కతాకు చెందిన ఈ లాటరీ సంస్థకు, తమిళనాడు లాటరీ వ్యాపారవేత్త శాంటియాగో మార్టిన్‌కు వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కంపెనీ రికార్డులు సూచిస్తున్నాయి. ఆ సంస్థలో నియమిత భాగస్వామిగా ఉన్న సుబ్బయన్ నాగరాజన్.. మార్టిన్‌కు చాలాకాలంగా వ్యాపార సహచరుడిగా ఉన్నట్లు సమాచారం.సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేసిన సంస్థగా మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ నిలిచింది. పథకం రద్దు తర్వాత బహిర్గతమైన వివరాల ప్రకారం.. ఈ సంస్థ ఎన్నికల బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.509 కోట్ల విరాళాలు అందించింది.

ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, ప్రభుత్వ సృష్టించిన కరవు: నిరంజన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

మహబూబ్ నగర్ జిల్లాలోని పెద్దగూడెం తండాలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పర్యటించిన ఆయన, ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరవని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో నిరంజన్ రెడ్డి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎల్ నినో పేరు చెప్పి ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టాలను వెంటనే అంచనా వేసి, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో 70 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, పాలమూరు, కల్వకుర్తి పంపులను ప్రభుత్వం నడపడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరాపై ప్రభుత్వానికి కనీస అవగాహన లేకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో సుమారు 2.5 కోట్ల మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. నష్టపరిహారం అందేవరకు రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

దుర్గాభవాని మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

జై భవానీ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

సంగారెడ్డి, అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :

కంది మండల కేంద్రంలో జై భవానీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాభవాని అమ్మవారిని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు తొలగిపోవాలని, కరువు కాటకాలు రాకుండా, విద్యుత్, తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రజలంతా ప్రశాంతమైన జీవితం గడపాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజల కష్టాలు తొలగిపోయి, గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులతో ప్రజలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోబుచ్చిరెడ్డి, మధుసూదన్ రెడ్డి,మోహన్ రెడ్డి, కృష్ణ గౌడ్ , శంకర్ గౌడ్, ఆనంద్ రావు, రవికుమార్, నందకిషోర్, వీరేశం, జంగయ్య, గౌస్, నవాజు, మురళి, భవానీ యూత్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పూల జాతరతో రాయిపల్లి గ్రామం పులకింత..!

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

గ్రామంలో పూల పండుగకు పోటెత్తిన మహిళలు

సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు

ఆట పాటలతో మహిళల కోలాహాటం





జహీరాబాద్, అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు రాయిపల్లి (డి) గ్రామంలో అంబరాన్నంటాయి. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడపడుచుల పండుగ బతుకమ్మను నారింజ వాగులో గంగమ్మ ఓడికి పంపారు. గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన వేడుకలకు మహిళలు భారీగా తరలివచ్చారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, జానపద గీతాలు, సంప్రదాయ నృత్యాలతో హనుమాన్ దేవాలయం వద్ద బతుకమ్మ డిజే పాటలతో మహిళలు కోలహాటలు, ఆట, పాటలతో సంబరాలు



ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు ఆడిపాడుతూ పూల పండుగలో సందడి చేశారు.

ప్రకృతిని ఆరాధించే అపురూప పండుగ బతుకమ్మ....!

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ప్రకృతిని ప్రేమిస్తూ పూలను పూజించే అరుదైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ వేడుకలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



విజయ దశమి పండుగ శుభాకాంక్షలు

సంగారెడ్డి, అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :

జిల్లా, పట్టణ, గ్రామాల ప్రజలకు రవి ముదిరాజ్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సంపదగా వర్ధిల్లాలని ఎన్ ఎం ఆర్ యువసేన జహీరాబాద్ డివిజన్ ఇంచార్జీ రవి ముదిరాజ్ బతుకమ్మ, దసరా, దీపావళి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ దసరా పండుగ శు భాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

గ్రామ సర్పంచ్ కుమ్మరి రాజేశ్వరి గోపాల్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా వేడుకలు

ఝరాసంగం, అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :



మండల పరిధిలోని గినియార్పల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ మహిళలు, ఆడపడుచులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.
గ్రామ సర్పంచ్ కుమ్మరి రాజేశ్వరి గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జేమ్లా తండా భూముల సమస్య పరిష్కరించాలి

సోలార్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలి

జిల్లా కలెక్టర్‌కు తండా వాసి విస్లావత్ తుకారాం వినతి





నారాయణఖేడ్, అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :

సిర్గాపూర్ మండలం జేమ్ల తండాకు సంబంధించిన భూముల సమస్యలను పరిష్కరించి, పూర్తిస్థాయిలో భూ సర్వే నిర్వహించే వరకు సోలార్ ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని కోరుతూ తండాకు చెందిన విస్లావత్ తుకారాం జెత్య నాయక్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గత ఏడాది డిసెంబర్ నుంచి సోలార్ ప్రాజెక్టు నిర్వాహకులు తండా రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లోకి వచ్చి బలవంతంగా భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో రైతుల పూర్వీకుల కాలం నుంచి వ్యవసాయ పొలాలకు ఉన్న రాకపోకల దారులను ధ్వంసం చేసి, వాటిని సోలార్ ప్రాజెక్టులో కలుపుకున్నారని పేర్కొన్నారు. 1976లో కేటాయించిన రెండు ఎకరాల భూమి స్వాధీనం. సర్వే నంబర్ 198లో రైతులకు చెందిన 15 గుంటల భూమిని ఆక్రమించారని ఆయన ఆరోపించారు. తండా వాసులు భూ సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు సర్వే నిర్వహించలేదని తెలిపారు. ఒకరి భూమిలో మరొకరు కబ్జాలో ఉండటం, సర్వే నంబర్లకు సంబంధించి హద్దుల వివాదాలు కొనసాగడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సర్వే నంబర్లు 198, 199, 200, 201, 202, 203, 204, 205, 206, 207, 208, 209, 210, 211, 218, 219, 220, 221, 222, 233లలో పూర్తిస్థాయి భూ సర్వే నిర్వహించి, భూముల హద్దులను నిర్ధారించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతుల భూములకు రక్షణ కల్పించడంతో పాటు, వ్యవసాయ పొలాలకు వెళ్లే దారుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. భూములపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం జరిగే వరకు సోలార్ ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని కోరారు. సోలార్ ప్రాజెక్టు తండాకు ఆనుకుని ఉండటంతో భవిష్యత్తులో తండా ప్రజలపై ఉష్ణోగ్రతల ప్రభావం ఏమైనా



ఉంటుందా అనే అంశాన్ని పరిశీలించాలని తుకారాం కోరారు. ఈ ప్రాంతంలో బోర్లు వేయాలంటే సుమారు 700 అడుగుల లోతు వరకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొంటూ, భూగర్భ జలాల పరిస్థితి, పర్యావరణ ప్రభావాలు సహా అన్ని అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. “మా భూమి, మా తండా మాకు హక్కు” అనే నినాదంతో తండా రైతులకు న్యాయం చేసి, భూ సమస్యలు పూర్తిగా పరిష్కరించే వరకు సోలార్ ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌ను విస్లావత్ తుకారాం కోరారు.

ధమ్మ యాత్రకు ఘన స్వాగతం

వార్త దీపిక న్యూస్ :

తథాగత భగవాన్ బుద్ధుడు చూపిన మార్గాన్ని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కొరకు రెండు రోజుల క్రితం మంచిర్యాల జిల్లా నుండి మహారాష్ట్రలోని నాగపూర్ దీక్షా భూమిలో జరిగే అశోక విజయదశమి కార్యక్రమానికి బయలుదేరిన సత్య ధమ్మ, బౌద్ధ ధమ్మ యాత్ర సోమవారం వాంకిడి మండల కేంద్రానికి చేరుకోగా మండల బౌద్ధ సమాజ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ యాత్ర మంచిర్యాలకు చెందిన సత్యధమ్మ ఉద్ధం సింగ్ కలరి ఐదవ చలో దీక్షా భూమి జాతర యాత్ర. గురు భూమన్న మహరాజ్, యశ్వంత్ మహరాజ్ లు మంచిర్యాల నుండి నాగపూర్ వరకు అనేక గ్రామాలు తిరుగుతూ అంబేద్కర్ నిజమైన ప్రత్యక్ష దేవుడని సత్యాన్ని ప్రచారం చేసి, బుద్ధ విహార్ పనులను పరిశీలించి, స్థానిక నాయకులతో సమావేశమై ముందుకు బయలుదేరారు.కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సందీప్, జిల్లా ఇంచార్జి విజయ్, ఆర్గనైజర్ రోషన్, వర్షవాస్ కమిటీ అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు, సమాజ అధ్యక్షులు శ్యామ్ రావు, వర్షవాస్ కమిటీ కోశాధికారి దుర్గం దీపక్, బౌద్ధ ఉపాసకులు పాండుజి, నాయకులు ఉప్రే, నాగ్సెన్, ప్రసాద్, భిక్షపతి, అన్నరావు, నూతన్ తదితరులు పాల్గొన్నారు.

బోరేగావ్‌లో వైభవంగా బతుకమ్మ వేడుకలు

సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పిన పూల పండుగ

సంగారెడ్డి అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు బోరేగావ్ గ్రామంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామ మహిళలు, ఆడపడుచులు, చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. కోలాటాలు ఆడుతూ, డీజే సౌండ్స్‌కు అనుగుణంగా నృత్యాలు చేస్తూ పండుగ సంబరాలను మరింత ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు, యువత, చిన్నారుల సందడితో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బోరేగావ్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో గ్రామ సర్పంచ్ పాట్లోళ్ల నాగేందర్‌తో పాటు గ్రామ పెద్దలు రామోజీ సుభాష్, పిల్లోడి బస్వరాజ్, బైలూ రాజు పాల్గొన్నారు. అలాగే యువకులు పిల్లోడి అంజన్న, రాజు, పట్లోళ్ల వినోద్, సబా సాయి, చెల్మెడ సంగన్న తదితరులు పాల్గొన్నారు. గ్రామ మహిళలు, ఆడపడుచులు, చిన్నారులు ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

సాయిపూర్ లో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి దంపతులు

తాండూరు, అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :

పట్టణంలో సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు తాండూరు పట్టణంలోని సాయిపూర్ లో అంగరంగ వైభవంగా జరిగాయి. పటోళ్లు దీప నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పండుగ శోభను సంతరించుకున్నాయి ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తన సతీమణి ఆర్తి రెడ్డి మాతృమూర్తి మాజీ జడ్పిటిసి విఠల్ రెడ్డి కలిసి సందడి చేశారు. వారితో కలిసి బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంప్రదాయ వ్యక్తుల్లో తరలివచ్చిన మహిళలు బతుకమ్మలు చుట్టూ పేరి పాటలు పాడుతూ ఆటలాడుతూ సందడి చేశారు తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని ప్రకృతి ఆరాధనకు ప్రత్యేకగా నిలిచే బతుకమ్మ పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.



పటేల్‌గూడలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

కుటుంబ సభ్యులతో పాల్గొన్న ఈర్ల రాజు ముదిరాజ్

పటాన్ చెరు, అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను అమీన్పూర్ మండలం, బిరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో గ్రామ ప్రజలు, మహిళా సోదరీమణులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, యువతులు రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని పెద్ద ఎత్తున చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య తెలంగాణ పూల పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో బిరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తమ ఇంటి నుంచి ప్రత్యేకంగా భారీ పూల బతుకమ్మను తీసుకువచ్చి కుటుంబ సభ్యులందరితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ మహిళా సోదరీమణులకు, ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పటేల్‌గూడ గ్రామంలో మహిళలు, యువతులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఈర్ల రాజు ముదిరాజ్ తెలిపారు. ఇలాంటి పండుగలు గ్రామ ప్రజల మధ్య ఆత్మీయతను, ఐక్యతను మరింత పెంపొందిస్తాయని అన్నారు. తెలంగాణ ఆడపడుచులందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో సంతోషం నిండాలని గౌరీదేవిని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొంటూ మహిళా సోదరీ మణులందరికీ హృదయపూర్వక సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సోదరీమణులు, యువతులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు.



లక్ష్మీనారాయణ పూర్ లో విషాదం

సెలవుపై వచ్చిన ఆర్మీ జవాన్ బలవన్ మరణం

తాండూర్, అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :



లక్ష్మీనారాయణపూర్ లో విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. దసరా పండగ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపడానికి సిలువులపై ఇంటికి వచ్చిన ఒక ఆర్మీ జవాను అర్ధాంతరంగా తను చాలించారు. విధి నిర్వహణలో దేశం కోసం సరిహద్దుల్లో నిలబడే ఆ సైనికుడు, కుటుంబం కలకాలం గుర్తుంచుకోవాల్సిన పండగ వేల బలవన్ మరణానికి పాల్పడటం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన బోయిన్ మల్లేశం భారతీయ సైన్యంలో జవానుగా దేశ సేవ చేస్తున్నారు. దసరా పండగ కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడానికి ఆయన ఇటీవల సెలవు పై సంతూర్ కి వచ్చారు బాగా మల్లేశంకు కేవలం 6 నెలల క్రితమే వివాహం జరిగింది నూతన దంపతులు పండుగను ఘనంగా జరుపుకోవడానికి ఎంతో ఆశపడ్డారు. నిన్నంతా మల్లేశం తన భార్య తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి ఆయన గదిలో మిగతాజీవిగా పడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. ఒక్కసారిగా ఈ దృశ్యం చూసి వారు నమ్మలేక కన్నీరు మున్నీరు అయ్యారు.

నడుస్తున్న బస్సులో గర్భిణీ ప్రసవం

పండంటి పాపకు జన్మనిచ్చిన తల్లి.. బిడ్డ క్షేమం..!

బస్సు డ్రైవర్ అప్రమత్తంతో ఆసుపత్రికి తరలింపు

తాండూర్ అక్టోబర్ 19, వార్త దీపిక న్యూస్ :

నడుస్తున్న బస్సులోనే ఓ గర్భిణికి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఘటన తాండూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. సోమవారం కర్ణాటక రాష్ట్రం జట్టు గ్రామానికి చెందిన గర్భిణి పుష్పలత తాండూర్ నుంచి చించెల్లి బస్సులో ప్రయాణిస్తుంది మార్గమధ్యంలో ఆమెకు ప్రతిఫలం కావడంతో బస్సులోనే ఉన్నవారు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని గమనించిన డ్రైవర్ సమయస్ఫూర్తితో సమీపంలోని ప్రభుత్వ మాతా శిశు సంక్షేమ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ఆసుపత్రికి చేరుకునే లోపే బస్సులోనే పుష్పలత ఆడబిడ్డకు జన్మించారు. అలాగే బస్సును ఆసుపత్రికి తరలించారు అనంతరం తల్లి బిడ్డను ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనతో బస్సులో ఉన్న వారు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు అత్యవసర సమయంలో స్పందించి సహకరించిన కర్ణాటక బస్సు డ్రైవర్ కు పుష్పలత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



--జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

వార్త దీపిక న్యూస్ :

ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలనీ అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం(సాధారణ)16 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, ఏ,వో యూనస్,జిల్లా అధికారులు పాల్గొన్నారు



టీ.జీ.పీ.ఎస్.సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 26వ తేదీలలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీ.బీ.టీ) విధానంలో జరుగనున్న పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్టు (అనలిస్ట్), అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ ద్వారా ఈ నెల 24, 26 తేదీలలో పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష జరిపారు. పరీక్షల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ సెంటర్ లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. 24న అసిస్టెంట్ సైంటిస్టు పోస్టులకు ద ధింవండి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుండి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బరీక్ష రాయడం లేదని వారి నుండి ధృవీకరణ పత్రం తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. ఏ చిన్నపాటి అవాంతరం, గందరగోళానికి తావు లేకుండా సాఎదుబాటులో ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రంలో వైద్య బృందాన్ని ఏర్పాటు చేయాలని, తాగునీరు, టాయిలెట్లు తదితర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 24మంది అభ్యర్థులకు ఒకరు చొప్పున ఇన్విజిలేటర్లను నియమించాలని, చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరు కూడా పరీక్షా కేంద్రం లోనికి సెల్ ఫోన్ తీసుకువెళ్లకూడదని స్పష్టం చేశారు. అధికారులు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పక్కాగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ట్రైనీ కలెక్టర్ సురేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.నిజామాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి గారిచే జారీ చేయనైనది



నవంబరు 1 నుండి జనజాతి గౌరవ్ దివస్ వేడుకలు-అనంత్ ప్రకాష్ పాండే

వార్త దీపిక న్యూస్ :

భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని నవంబరు 1 నుండి 15వ తేదీ వరకు జనజాతి గౌరవ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారి అనంత్ ప్రకాష్ పాండే అన్నారు.సోమవారం ఢిల్లీ నుండి వీడియో సమావేశం ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనజాతి గౌరవ్ దివస్ వేడుకలలో భాగంగా నవంబరు 15న ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు, నవంబరు 1 నుండి 15 వరకు 15 రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు.గిరిజన ప్రాంతాలలోని పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడంతో పాటు ప్రభాత్ ఫేరీలు చేపట్టాలని తెలిపారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వారు అందించిన సేవలు, చేసిన త్యాగాలను విద్యార్థులకు, యువతకు తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.గిరిజనుల హక్కులు, రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి పథకాలు, చట్టాల ద్వారా గిరిజనులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు.గిరిజన ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి, స్వయం ఉపాధి, వ్యవస్థాపకతను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గిరిజన భాషల్లో సమాచారాన్ని అందించేందుకు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించేందుకు ఆదివాణి మొబైల్ యాప్ ను విస్తృతంగా వినియోగించాలని సూచించారు.జిల్లాలోని గిరిజన లబ్ధిదారులను వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో సమావేశ మందిరం నుండి జిల్లా అదనపు కలెక్టరు (రెవెన్యూ) ఎం.డేవిడ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.



Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984